# పనికిరాని మనిషి

నేనేమీ తప్పు చేయడం లేదు.

అలా గనకపోతే మరేలాగంటావులే.

ఎలాగేమిటి నీ మొఖం. ఇందుకనే నిన్ను చూస్తే నాకు కోపం వస్తుంది. నీకు కావలసి ఉంటే నా దగ్గరికు వస్తావు. వచ్చి ఆ సరుకుందా అని అడుగుతావు. నాదగ్గర ఉంటే నీకిస్తానంటాను. దాని ధర ఎంతంటావు. ఇంతని చెప్తాను. నీకింతకు కావాలని బేరమాడుతావు. తునితగవుగా ఎంతకో ఓ అంతకు కుదుర్చుకుంటావు. కుదుర్చుకుని పుచ్చుకుంటావు. ఇక ఇంతేకదా మేము చేసే వ్యాపారమంతాను. ఇందులో నా తప్పేముంది? నీ కిష్టమైంది ఇలా కష్టంలేకుండా ఇచ్చినందుకా పైపెచ్చు నామీద పరువునష్టం కలిగే పదాలు ప్రయోగిస్తావు.

ఏదో లేరా స్నేహితుడవని అన్నాను. మరయితే నీ తప్పేమీ లేదంటావా? (సందేహంగా)

అదిగో మళ్ళీ మొదటికే వస్తున్నావు.

అవునులే నీతప్పేముంది. మనందరికీ పైనఉన్న మన దేవుడు నలుపు. ఆయనగారి క్రిందవున్న ఈ ఆకాశం నలుపు. దాని అడుగునఉన్న మనం నలుపు. మరి మన మరుగునఉన్న మన వ్యాపారమూ న లు పే. ఇక దాని పొరుగునఉన్న మాబోటివాళ్ళపనే... ...

ఆ ఎలాగుందేమిటి ?

ఎలాగుందనను మిత్రమా ! మీరు ధనధృవాలు. మేము ఋణధృవాలు. ఇవి రెండూ కలిస్తేనేగాని విద్యుత్తు ప్రసరించదు. మరి మీ వ్యాపారమూ సాగదు. మరి మాపనీ నడవదు.

శహబాష్ ! బలేగా చెప్పావోయ్.

ఎంత బాగా చెప్పితే ఏం ? మా మాటలకు మీధరలు లేవు.

అదిగో మళ్ళీ మొదటికే దిగుతున్నావు.

దిగనియ్యవయ్యాబాబూ దిగనియ్యి. ఎంతలోతుకు దిగగలనో చూడనియ్.

ఇలాంటి చవటకబుర్లే చెప్పొద్దన్నాను.

ఔనౌను. మరచిపోయాను. లాభంలేకుండా కబుర్లు దూబరాగా ఖర్చు చేయగూడదు.

ఆ అలానేర్చుకో బాగుపడతావు.

అవునోయ్. నీవద్ద కొన్నాళ్లు తరిఫీదు పొందాలి. అలా చేస్తేనే గాని ఈచిక్కులన్నీ చక్కబడేటట్టులేవు. ఏమంటావ్ బ్రదర్! సరుకు నిలవవేస్తాను. ఎవ్వరు వచ్చినా లేదనేస్తాను. అసలది నాదగ్గఆ ఉంటేగా. గొదాములలో ఉంది. అది బాగా నిలవబడిపోయి, పురుగులు పట్టి పొట్లిపోయి ముక్కిపోయి, తుక్కయి ఎందుకూ పనికిరాని దయ్యేదాక ఊరుకుంటాను. అసలది ఎంత కుళ్ళిపోతే అంత మంచిది. భూమికి ఎంత కుళ్ళిన ఎరువు వేస్తే అంత గుణం ఇస్తుంది. అదే చక్కని ఎరువు. ఈ ఎరువునీ ఇలాతలంలోని జనాభా కఊవుదీర మేసేసిందంటే ఏంత గట్టి ఇనపకడ్డీ అయిపోతుంది! అందుకనే బోలెడన్ని సరుకులు, ఈ స్టోర్సులలో విడుదల చేయబడకుండా అలా దాచ బడతాయి! ఇక ఈ సరుకు ఫలహారంలా పంచిపెడతాను. అందరూ ఒక్కసారి అడిగితే నేనెక్కణ్ణుంచి తీసుకురాను. ఎవరికి శక్తి ఉంటే వాళ్ళు కొనుక్కుంటారు. మరి ధర కాస్త ఎక్కువగానే ఉంటుంది. వీళ్ళకోసం ఇంత పుష్టిగల ఆహారం తయారు చెయ్యడంకోసం నాకు ఎంతవడ్డీ నష్టంకాలేదు. ఎన్నాళ్ళు గొదాముల అద్దె నష్టమవలేదు. ఇక అనేకరకాల తనుగులూ వగైరాలు చూచుకోండి. ఏంమంటావ్ షాహుకార్?

అంతేనోయ్. అంతే. కాని, ఇంకో పెద్ద విషయం మరచి పోయావు. ఇన్నాళ్ళూ నీసరుకు కే హాని లేకుండా కాపలా గాసిన వాళ్ళ మాటేమంటావు?

ఓ యస్. మరచిపోయాను. దానికేముంది. వాళ్ళ మామూలు మామూలుగానే ఇచ్చేద్దాం. ఇంతకీ ఏ గాది క్రింది పందికొక్కు ఆగాది క్రింద బ్రతక్క చస్తుందేమిటి. పోనియ్యవోయ్ పోనియ్. ఎలాబ్రదికేవాళ్ళ నలా బ్రదకనియ్. మనకు కావలసింది బ్రదకటమేగా! కోటి విద్యలూ కూటికొఱకే. పట్టెడన్నం కోసం పడరాని పాట్లు పడాలి. ఈ గుక్కెడుప్రాణం ఇలా ఈ గొంతుకలో కూరుకపోయి వున్నంత కాలం ఏదో విధంగా కక్కుర్తి పడక తప్పదు.

నిజం చెప్పావురా కాని, తీరా ఇన్ని జులుములు వదలి, ఎన్నో కేసులు జుల్మానాలు అన్నీ తీరిన తరువాత మనకు మిగిలేది హళ్ళికి హళ్ళీ సున్నకు సున్నే.

అవునోయ్ అవును ఈ శరీరం దేనికి చెప్పు. పరోప కారం కోసమేగా. మనకు మిగులు తుందని మొదట్లో అను కున్నామా ఏమిటి? ఒకప్పుడు మిగుల్తుంది. ఒకప్పుడు తగుల్తుంది. ఇలా చూశావు నాకింకోమంచి ఆలోచన తట్టింది. ఈ ప్రాజెక్టు లన్నీ ఎందుకు కడుతున్నా రంటావు చెప్పు.

ఎందుకేమిటి. అధికాహారోత్పత్తికిగా.

అదే నేను అనేది. అధికంగా ధాన్యాలు పండించ బడితే మనబోటి చిన్నవర్తకులం ఏమై పోవాలి చెప్పు. ప్రభుత్వం కాస్తయినా ఇలాంటి వాటిల్లో మనలాంటి వాళ్ళని

అడిగి మన సలహామీద నడవాలంటావా లేదా? నిజానికి ప్రభుత్వం మనతరఫున లేదోయ్. చూడు పై పెచ్చుమనలనే ఈ అడ్డకట్టలకి చందాలిమ్మంటుంది. మన పీకలు తీసే నాటికి మనం చందా లివ్వాలా?

అంటే?

అంటే ఏమిటి? ఇందుకనే నీది చిన్న బుర్రన్నాను. కొంచెం పెద్దబుర్ర ఉంటే ఎందుకైనా మంచిది. గుప్పెడు టెంకాయిలో నీళ్ళెన్ని ఉంటాయి. అమలాపురం గంగా బొండాంనీళ్ళు తాగాలి. కడుపు నిండాలి. మరి పంటలు హెచ్చుగా పండేస్తే వర్తకులలో వర్తకులకు పోటీవచ్చేయ్యదటోయ్ వెర్రిపుల్లయ్యా. పోటీ ఉంటే, నువ్వూ నేనూ బ్రదుకుతామా? హెచ్చుపంట ఉంటే వర్తకులలో ఐకమత్యం దివాళా తీస్తాదిగా.

మరి మన డబ్బు పై దేశం పోదటరా.

పోతే మనకేం. ముందు మనమా మన చుట్టుప్రక్కల వాళ్ళా? పైవాళ్ళకి కొంత కిడితేనేగాని మనకు అసలుకూడ కిట్టదు.

ఔనౌను. నేనింతదూరం ఆలోచించ లేకపోయాను.

అంతటితో అయిపోయిందనుకోకు. ఈ ప్రాజెక్టులను ఆపేశాం సరే. మరివెధవిది, శాస్త్రకారు లొకళ్ళీ దేశాలమీద

దెయ్యాల్లా హెచ్చయి పోతున్నారుగా! వాళ్ళ తస్సాదియ్యా వాళ్ళబుఱ్ఱల్లో పాతర్లలా ఊరుతా యనుకొంటాను. వాళ్ళెక్కడలేని ఎరువులు తయారుచేసేసి ఏడాదికి నాలుగై దేసి పంటలు వట్టిపఱ్ఱభూముల్లోకూడ పండిం చేస్తారట. ఇలాటప్పుడు మరి చిక్కే. మరి అప్పుడేం చెయ్యాలో తెలుసా? ఒక తెలివైన శాస్త్రకారుణ్ణి మనం కొనెయ్యడం. కొనేసి, ఒకే అబ్బాయి, పంటల్ని త్వరితంగా మేసే పురుగుల్ని ఇవ్వరా అనటం. వాడు ఇస్తాడుకదూ, అప్పుడు మనం ఆ పంటల మీద వాటిని వదిలేయడం. ఇక చూసుకో అప్పుడు మనపంట! మనదగ్గఱ ఉన్న వాటికి ఎంత గిరాకీ వస్తుందనుకున్నావ్.

అమాంతంగా అన్ని పంటలు పాడు చేసెయ్యడమే!

ఆ.

ఎంతమంది చచ్చిపోతారంటావ్?

అసలు నీకిలాంటి అనుమానాలు రాకూడదు. ధైర్యంగా ముందుకు నడవాలి. ధైర్యమే ధనం. ధనమే ధైర్యం.

అబ్బే అంతపని చేయడమెలారా?

ఛీ! ఇంత చచ్చుపీనుగ వనుకోలేదు. అసలు ఇందులో మనంచేసిన తప్పేముంది? తుఫానురావడం లేదూ? పంటలు తుడుచుకుపోవటంలేదూ? అలాగే పురుగులు పట్టేశాయనుకొంటారు. ఒకొక్కప్పుడు వాళ్ళు వాటికి విరుగుడుకూడా

వెయ్యొచ్చు. అప్పుడు ఆసరుకులు చవకగాకొని గిడ్డంగులలో నిలవేసి తగులబెట్టేస్తాం. ఇవతల ఇన్సూర్యెన్సువాళ్ళ వద్దా లాభం కొట్టొచ్చు. అవతల మిగిలిన సరుకు విలువా హెచ్చి అలాగ కూడ చులాగ్గ లాభం తియ్యొచ్చు. ఒక్క దెబ్బని రెండు పిట్టలు కొట్టేస్తా మన్నమాట.

ఏమిటిరా ఇలాంటి దారుణాలు చెప్పుతున్నావు. హిట్లరులా అయిపోతున్నా వేమిటి?

ఛీఛీ. హిట్లరేమిటి! వాడికి వర్తకం తెలియదురా బాబ్జీ. తడిగుడ్డలతో పీకలు కోసెయ్యాలి. మేకవన్నె పులుల్లా ఉండాలి. నొప్పి కలగకుండా పని జరుపుకోవాలి.

నేనిలాంటి మాటలెప్పుడూ వినలేదు. ఇదేంవర్తకంరా?

ఇదేం వర్తకమో నీకూ తెలుసు. కాని కొంచెం జాస్తీ అయ్యేటప్పటికి జంకుతున్నావు. చిన్ని వ్యాపారంలో కొన్ని ప్రాణాలే పోవొచ్చు. అలాంటప్పు డెలాంటి ధైర్యాన్ని ప్రదర్శించి నిలబడ గలిగామో అదే ధైర్యంతో పెద్ద వ్యాపారంలో పెద్దతరహాగా ప్రాణాలు పైకి పలాయనం చేసేటప్పుడు నిలబడి ఆ ధైర్యాన్ని, ఆ కార్యదీక్షను ప్రదర్శించాలి. ఇది మహాధన యజ్ఞంరా బ్రదర్. ధనంలేనిది ధరలేదు.

నీకు మతిపోయిందా పిచ్చిపట్టుకుందా.

నీకు పోయినమతి, నీకుపట్టిన పిచ్చేరా ఇది. చూడు. మనం ఇలాంటిపనులు చేసేప్పుడు ఒక్కొక్కప్పుడు ఎంత ధనాన్నైనా వెచ్చించవలసి ఉంటుంది. అప్పుడప్పుడు మనం మసికూడ అయిపోవలసివస్తుంది. అయినాసరే మనం నిలబడ గలగాలి. కొన్నిసమయాలలో ఇలాంటిపనులకు స్త్రీలనుకూడ పరికరాలుగా ఉపయోగించుకోవాలి. ఉరికంబానికి ఎక్కవలసి వచ్చినా సహించాలి. ఇలా కొంతమంది మనబోటి వర్తకుల ప్రాణాలు ఆహుతి అయితేనే గాని ఈ ఉద్యమం రూపుకట్టదు.

ఇదేం ఉద్యమంరా !

ఇదేమిటో నీకు తెలియదూ ? ఇది నల్లబజారోద్యమం. నల్ల అంటే రక్తం. రక్తం లేకపోతే మనిషిలేడు. నల్లబజారు లేకపోతే వర్తకంలేదు.

అబ్బ. ఎందుకురా ఈ కొరడాదెబ్బలు. నీకింత రాక్షసత్వం వచ్చేసిందేం ?

ఛా. అలా భయపడతావేమిటిరా. మనమేం తప్పుచేశాం. ప్రాజక్టులను ఆపించామని ఎవరికి తెలుస్తుంది. పంటలు మనవల్ల పాడైపోయాయని ఎవరనుకుంటారు. మనదగ్గర సరుకుఉంటుంది. అదైనా కొద్దిగా ఉంటుంది. వాళ్ళకుకావాలి. అంచేత మన దగ్గఱకు రావాలి. వస్తారు. ధర ఎంతఅంటారు. ఇంతనిచెప్తాం. వాళ్ళకు నచ్చితే కొనుక్కుంటారు. లేకపోతే లేదు. ఇందులో మనం చేసిందేముంది? మన తప్పేముంది?

'అబ్బ! (కాస్సేపాగి) నా గుండెల్ని తినేశావురా. నిజంగా నేను చేస్తున్నది తప్పే. నే నెంత పాపానికి పూనుకున్నాను!'

'ఇదిగో మళ్ళీ మొదటికే వస్తున్నావ్. అన్నిటికీ దేవుడే వున్నాడు. ఎందుకలా ఇదయి పోతావ్.'

'ఇక ఆగరా బాబూ. వీళ్ళందటి ప్రాణాల్నీ ఇలా ఈ డబ్బు సంచులలో పెట్టి బిగించి హరించే నాఅంతటి కిరాతకుడింకొకడు లేడు. ఛి ఛీ. నా ఈ ధన్నాన్ని తీసుక పోండి. ప్రాజక్టులు నిర్మించండి. శాస్త్రజ్ఞుల్ని తయారు చెయ్యండి. వాళ్ళను మంచికే ఉపయోగించుకోనండి. దేశాన్ని పాడి పంటలతో నింపండి. కఅవు కాటకాలు కాలికొద్దీ పరుగు పెట్టేట్టుచెయ్యండి. నిజంగా నేనిప్పటివరకూ ఎంత తప్పుచేశాను!'

'ఛి ఛీ. ఇంత ధమాధంగా మాట్లాడుతా వనుకోలేదు. క్రియారూపం దాల్చబోయే ఎంత చక్కటి ఉద్దేశాలను హతమార్చేశావు. నిజానికి నువ్వెందుకూ పనికిరావు.'

'(నవ్వుతూ) నిజమే. అయిదు నిమషాల్లో నన్నెందుకూ పనికిరాకుండా చేశావు.'

---